పెద్ద కథ



# పట్నంలో పసివాడు

చిత్రపు హనుమంత రావ్

(గత సంచిక తరువాయి)

ఓ రోజు ఉదయం ఎనిమిది గంటలు కావస్తున్నా గోపాలం నిద్రలేవలేదు. స్వర్ణలత అతడు లేచాడేమోనని రెండు సార్లు చూసింది. గాఢనిద్రలో వున్నాడేమోనని ఊరుకుంది. ఎనిమిది కావస్తున్నా లేవకపోవడంతో తలుపుతట్టింది. గోపాలం తలుపు తెరిచాడు. అతడి జుత్తంతా చెదిరివుంది: కళ్ళు ఎర్రగా ఉన్నాయి.

"అలా వున్నారేం."

"వంట్లో బావుండలేదు" అంటూ గోపాలం వెళ్లి మంచంమీద కూర్చున్నాడు. స్వర్ణలత అతడి నుదుట చెయ్యివేసిచూసి.

"వళ్లు కాల్తోంది. నేను వెళ్ళి డాక్టర్ని తీసుకొస్తాను" అంది.

సుందరమ్మ కాఫీ తెచ్చి ఇచ్చింది. స్వర్ణలత వెళ్ళి డాక్టర్ని వెంటబెట్టుకొచ్చింది. డాక్టరు అతడిని పరీక్షించి, అన్నాడు:

"కంగారు పడాల్సిందిలేదు. "ఇండైజెషన్"వల్ల వచ్చింది. మీ భోజనం ఎక్కడ? గోపాలం హోటల్ పేరు చెప్పాడు. డాక్టర్ మందులురాసి ఇస్తూ,

"మీకు హోటలు భోజనంపడదు. మీరు హోటలు భోజనం మానేస్తే మంచిది." డాక్టరు వెళ్ళిపోయాడు.

"బాబూ మీకు ఈ వూరు వచ్చేంతవరకు హోటలు భోజనం అలవాటులేదా." అంది సుందరమ్మ.

"లేదండి. మాది విశాఖపట్టణం. మా అన్నయ్య ఆ వూళ్లో పనిచేస్తున్నాడు. మా అమ్మకూడా అక్కడే వుంటోంది. నా చదువంతా ఆ ఊళ్లోనే అయింది. ఆ తర్వాత యూనివర్సిటీలో "ట్యూటరు"గా వున్నాను. ఇక్కడ మంచి ఉద్యోగంవస్తే వచ్చాను."

"ఇకనుండి మా యింట్లోనే భోజనం చెయ్యి." అంది సుందరమ్మ.

"ఫర్వాలేదండీ. హోటలుమారిస్తేసరి"

"అంత మొహమాట మెందుకండీ. పోనీ అంతగా నచ్చకపోతే 'పేయింగు గెస్టు'గా వుండండి అంది స్వర్ణలత.

"అయితే నెలకి ఓ నూటయాభై తీసుకునేటట్లయితే సరే. అంతకు తక్కువైతే నేను చెయ్యను."

"అబ్బ. మీ పంతం నెగ్గించుకుంటారు కదా అలాగేలెండి" అంది స్వర్ణలత. స్వర్ణలత బజారుకెళ్ళి మందులు తెచ్చింది. ఆ రోజు ఆమె కాలేజీకి వెళ్ళలేదు. వేళపట్టున అతడికి మందులిచ్చింది. రెండు రోజులకు గోపాలానికి జ్వరం తగ్గింది.

గోపాలానికీ, స్వర్ణలతకీ ఒకేసారి భోజనాలు వడ్డించేది సుందరమ్మ. గోపాలం భోజనమవడమే తరువాయి బస్సుస్టాండుకి పరిగెత్తేవాడు.

"నేనూ అదేబస్సుస్టాండులోబస్సెక్కుతాను కదా. మీరెందుకు పరిగెడతారు? ఇద్దరం కలిసే వెళ్ళొచ్చుగా? అంది స్వర్ణలత ఒకసారి.

"ఇద్దరం కలిశా?" గోపాలం తెల్లబోతూ అన్నాడు.

"అవును ఏంవెడితే?"

"నలుగురూ ఏమనుకుంటారు?"

స్వర్ణలత నవ్వింది.

"ఆడదాన్ని నాకు లేనిభయం మీకెందుకండి. రేపట్నుంచి ఇద్దరం కలిసేవెడదాం" అంతవరకూ స్వర్ణలత భోజనమయ్యాక చీరా. జాకెట్టూ మార్చుకునేది; ఆ మరునాటినుండి చీరా. జాకెట్టూ. మార్చుకుని. అలంకరణ పూర్తి చేసుకుని భోజనానికి వచ్చేది. భోజనం కాగానే పుస్తకాలు చేతబట్టుకుని గోపాలంకోసం ఎదురుచూసేది. అతడికి తప్పనిసరయ్యేది ఆమెతో కలిసి వెళ్ళటం.సాయంత్రాలపూట ఏకూరలోతేవడానికి బజారు వెళ్ళేది స్వర్ణలత. గోపాలాన్ని తోడు రమ్మనేది. అతడు కాదనలేకపోయేవాడు. వాళ్ళిద్దరినీ చూసినప్పుడల్లా సుందరమ్మకి ఓ ఆలోచన వచ్చేది.

స్వర్ణలత పరీక్షలయిపోయాయి.

స్వర్ణలతకి గోపాలంపై అనురాగం. అభిమానం ఎక్కువై పోసాగాయి. సాయంత్రాల పూట అతని కోసం ఎదురుచూసేది: అతనొచ్చేవరకు టిఫిన్ కూడా తీసుకునేది కాదు. తను అతడిని గాఢంగా ప్రేమిస్తున్నట్లు తెలుసుకుంది. అప్పుడప్పుడు గోపాలం ఆమె కలల్లోకి వచ్చేవాడు. ఆ కలల్లో సుందరోద్యానవనాలు...ఆ వనంలో తను.... తనప్రక్క గోపాలం.... చేయీ చేయీ.... కలుపుకుని విహరించడం.... గోపాలం చేతిని మరి గట్టిగా పట్టుకోబోయేది. ఖంగుమన్న శబ్దంతో మెలకువ వచ్చేసేది లైటువేసి చూస్తే బల్లమీద వుండాల్సిన మరచెంబు నేలమీద పడి వుండేది: "ఇంతసేపూ నేను పట్టుకున్నది గోపాలం చెయ్యి కాదన్నమాట" అనుకునేది:

సుమారు రెండునెలలు గడిచాయి. ఒక రోజు స్వర్ణలత రిజల్ట్సు వచ్చాయి. ఆమె 'ఫస్టుక్లాసులో' పాసయింది. గోపాలం ఆమెను 'కంగ్రాట్యులేటు' చేశాడు "దీన్లో నా ఘనతేమీలేదు.... మీరు నాకు "మేథమెటిక్స్" అంత బాగా చెప్పివుండకపోతే ఫస్టుక్లాసు కాదుగదా, పాసుకూడా కాలేకపోదునేమో?" స్వర్ణలత నవ్వుతూ అంది.

"అదేంకాదు స్వర్ణా.... నువ్వు తెలివైన దానివి.... నేను చెప్పింది వెంటనే అర్థం చేసుకునే దానివి.... అది సరేగాని నీకొక "ప్రెజెంటు" ఇవ్వాలని వుంది.... ఏదైనా కోరుకో...."

"నాక్కావాల్సింది తరువాత కోరుకుంటాను....ఇవాళ ఓ చిన్న "ప్రోగ్రాము మీరు ఆఫీసుకి సెలవు పెట్టాలి...."

ఆ రోజు గోపాలం ఆఫీసుకి సెలవు పెట్టాడు. పొద్దున వంటంతా స్వర్ణలత చేసింది ఓస్వీటూ, ఓహాటూ, కూడాచేసింది.

# పట్నంలో పసివాడు

మధ్యాహ్నం ఇద్దరూ కలిసి సినిమాకి వెళ్ళారు. ఆ తర్వాత సాయంత్రం ఇద్దరూ కలసి "పబ్లిక్ గార్డెన్సు"కి వెళ్ళారు. పచ్చికలో ఇద్దరూ ప్రక్క ప్రక్కనే కూర్చున్నారు.

"మొదట్లో నిన్ను చూస్తే భయమేసేది. నువ్వు చాలా కఠినాత్మురాలి వనుకునే వాడ్ని.... రోజులు గడిచేక నీకు అందమే కాక మంచిమనసు కూడా వుందని తెలిసింది...." స్వర్ణలత అతడివైపు చూసి. సిగ్గుతో ముఖం దించుకుంది. ఆ తర్వాత అతి మెల్లగా "మీరంటే నాకు చాలా ఇష్టం" అంది.

"నువ్వంటే కూడా నాకు చాలా ఇష్టం స్వర్ణా." అన్నాడు గోపాలం.

"అమ్మదొంగ పిల్లాడా ఇంతవరకూ చెప్పావు కాదు" అనుకుంది స్వర్ణలత.

"ఎందుకు నేనంటే మీకంత ఇష్టం?"

"మంచివాళ్ళంటే నాకు చాలా ఇష్టం."

"అంతేనా? అంతకు తప్పించి మరేమీ లేదా?"

గోపాలం బదులు చెప్పలేదు.

"పొద్దున్న నన్ను ఏదైనా కోరుకోమన్నారు గుర్తుందా? ఇప్పుడు కోరుకోనా?"

"కోరుకో స్వర్ణా...."

"మిమ్మల్ని ప్రేమిస్తున్నాను.... మీ హృదయంలో కాస్త జాగా ఇవ్వండి చాలు...."

గోపాలం 'ఉలిక్కి'పడి ఆమె వైపు చూశాడు. ఆమె ఆతృతతో అతడి సమాధానం కోసం ఎదురు చూస్తోంది. కొద్ది క్షణాలు ఆలోచించి.

"చీకటి పడింది స్వర్ణా.... ఆ విషయం తర్వాత చెబుతాను...." అన్నాడు.

"పదండి" అంది నిరుత్సాహంతో స్వర్ణలత.

స్వర్ణలతకి గోపాలం మనసు అర్థమైంది కాదు. చెప్పడానికి సిగ్గుపడి వుంటాడని సమాధానపడింది.

ఒకటి రెండు రోజులు గడిచిపోయాయి. కాకినాడ నుండి సుందరమ్మ తమ్ముడు వచ్చాడు.

"స్వర్ణ చదివింది చాలు.... ఎక్కడైనా మంచి సంబంధం వుంటే చూడు తమ్ముడూ" అంది సుందరమ్మ.

"అలాగేలేవే అక్కయ్యా...." అన్నాడాయన.

తల్లి చెవిన తన మనసులోని మాట వేసింది స్వర్ణలత. ఆవిడ కూతురివైపు ఆశ్చర్యంతో చూసింది. స్వర్ణలత ముఖం దించేసుకుంది.

'ఏమోనే తల్లీ.... అతడేమంటాడో... అతరు చూడబోతే పెద్ద ఆఫీసరు అంత కట్నం ఇవ్వగలనా?' అంది.

ఆ తర్వాత గోపాలం దగ్గర ఆ విషయం కదిపింది. గోపాలం చాలాసేపు మాట్లాడలేదు. చివరకు.

'మేనరికం వుందండి. మా మామయ్య కూతురు చిన్నప్పటినుండి అనుకుంటున్న సంబంధం.... పైగా మా అమ్మ మామయ్యకి మాట ఇచ్చింది కూడా" అన్నాడు.

'అలాగా. ఆ సంగతి నాకు తెలీక అడిగాను బాబూ' అంది సుందరమ్మ.

ఆ రాత్రి స్వర్ణలతకి నిద్ర పటలేదు. ఇంతకాలమూ గోపాలం తనను ప్రేమిస్తున్నాడనుకుంది; అతడికి మేనరికం వుండి వుంటుందని కూడా వూహించలేదు.

ఆ రోజు మొదలు గోపాలానికి దూర దూరంగా తిరుగుతోంది స్వర్ణలత.

గోపాలం ఉండబట్టలేక,

'నువ్వీమధ్య నాతో సరిగ్గా మాట్లాడ్డం లేదు స్వర్ణా...." అన్నాడు.

'అవును....'

'ఎంచేత.... నా వల్ల పొరపాటు జరిగిందా....?'

"ఇంతకాలంగా వుంటున్నారు. నా మనసు గ్రహించలేకపోయారు. మిమ్మల్ని నేను గాఢంగా ప్రేమించాను. మీరుకూడా నన్ను ప్రేమిస్తున్నారని నమ్మాను"

"నువ్వు ప్రేమిస్తున్నట్టు నాకు తెలీదు."

"పోనీ యిప్పుడు తెలిసిందిగా."

"మా అమ్మ మామయ్యకి మాట ఇచ్చింది. మా అమ్మకు ఎదురుచెప్పలేను."

స్వర్ణలత మాటలు పొడిగించలేదు. విసురుగా లోపలకు వెళ్ళిపోయింది.

ఎదురింటి కావమ్మగారు రామేశ్వరం ప్రయాణం పెట్టుకుంది. ఆ విషయం సుందరమ్మతో చెబుతూ.

"నువ్వుకూడా రాకూడదా సుందరమ్మా. అబ్బాయి తీసుకెడుతున్నాడు. తక్కిన పుణ్యక్షేత్రాలుకూడా చూడచ్చు." అంది కావమ్మ.

సుందరమ్మ చాలాకాలంగా దక్షిణాదిన వున్న పుణ్యక్షేత్రాలు చూడాలని అనుకుంటోంది. కానీ వీలుచిక్కింది కాదు. అంచేత కావమ్మతో "ఆలోచించుకుచెబుతాఅంది." స్వర్ణలతకూడా తల్లిని వెళ్ళమంది. సుందరమ్మ కావమ్మతో చెప్పింది తనూ కూడా వస్తున్నట్లు. ఓ మంచిరోజు సుందరమ్మ. కావమ్మా. ఆవిడ కొడుకూ ప్రయాణమయ్యారు" "టాక్సీ" ఎక్కుతూ గోపాలంతో అంది సుందరమ్మ.

"నేను రామేశ్వరం వెడుతున్నాను బాబూ. దక్షిణాదిన వున్న తక్కిన పుణ్యక్షేత్రాలుకూడా చూస్తాం వీలునుబట్టి. పదిహేనూ, ఇరవై రోజుల్లో వచ్చేస్తాం. నువ్వుండబట్టి అమ్మాయినిగురించి బెంగలేదు. ఇల్లు జాగ్రత్త."

స్వర్ణలత గోపాలానికి దూరదూరంగానే తిరుగుతోంది. అంతగా మాట్లాడ్డంలేదు కూడా. వంటవగానే "భోజనానికి రావచ్చు" అంటుంది; ఉదయమూ, సాయంత్రమూ కాఫీ ఇస్తుంది. గోపాలం పుస్తకాలు చదవడంలో నిమగ్నుడయ్యేవాడు.

ఓ రోజు సాయంత్రం గోపాలం పినతండ్రి కొడుకు సుందరం వచ్చాడు. సుందరం ఇంచుమించు గోపాలం వయసువాడే. అతడు వచ్చేసరికి స్వర్ణలత పూల మొక్కల్లో తిరుగుతోంది. సుందరాన్ని చూస్తూనే,

---

# మైడియర్ మనిషీ!

నువ్వు చూసినా చూడకున్నా
నీవద్ద ఓ టెలివిజన్ సెట్టుంది
—అదే నీ మనస్సు!

నువ్వు కొల్చినా కొలవకున్నా
నీవద్ద నిజాన్ని కొలిచేఓకొలబద్దవుంది
—అదే నీ అంతఃకరణ!

నువ్వు పంచినా పంచకున్నా
నీలో ఒలికే ఓ అమృత కలశముంది
—అదే నీ హృదయం!

నువ్వు మీటినా మీటకున్నా
నీలో పలికే ఓ వీణవుంది
—అదే నీ చైతన్యం!

నువ్వు విన్నా వినకున్నా
నీలో హోరుమనే ఓ సముద్రముంది
—అదే నీ అసంతృప్తి!

నువ్వు పలికినా పలక్కున్నా
నీలో తపిస్తో పిలిచే ఓ స్వరం ఉంది
—అదే నీ ఆత్మ వికాస కాంక్ష!

—కళాధర్

"ఎప్పుడొచ్చావురా సుందరం. ఎక్కడ దిగావు? ఎన్ని రోజులుంటావు? తిన్నగా ఇక్కడికే వచ్చెయ్యక పోయావా?" అన్నాడు గోపాలం.

"ప్రొద్దున వచ్చాను. ఈ వూర్లో మా కంపెనీ కాన్ఫరెన్సు జరుగుతోంది. రేపు రాత్రి వెళ్ళిపోతాను నువ్వెవరి ఇంట్లోనో వుంటున్నావని హోటల్లో దిగాను."

"మా ఇంటి వాళ్ళు అలా అనుకునే రకంకాదు. ఈ సారి వచ్చినప్పుడు తిన్నగా నా గదికే వచ్చెయ్యి."

"సరే పద. నా గదికి వెడదాం." అన్నాడు సుందరం.

గోపాలం సుందరాన్ని అనుసరించాడు. దారి మధ్యలో సుందరం అన్నాడు.

"ఒరేయ్ గోపాలం.... మొత్తానికి మంచి చోటే వేశావురా పాగా...."

గోపాలం అతడివైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

"అంత అందమైన అమ్మాయివున్న ఇంట్లో చేరావు. ఇంతకి ఆ అమ్మాయితో స్నేహం కలిపావా?.... స్నేహం ఎంత వరకూ వచ్చింది." సుందరం కుతూహలంతో అడిగాడు.

"స్నేహమంటే?...."

"సోషల్‌గా తిరగడం .... పార్కులకి, సినిమాలకు కలసివెళ్ళడం...."

"అలాంటిదేంలేదు...."

సుందరం మాట్లాడలేదు, "వాడుత్త యూస్‌లెస్ ఫెలో" అనుకున్నాడు. ఇద్దరూ ఆటో రిక్షాలో సుందరం బస చేసిన హోటలుకి వెళ్ళారు.

వాళ్ళిద్దరూ కాస్సేపు కబుర్లు చెప్పుకున్నారు. ఆ తర్వాత సుందరం బల్లమీద వున్న బ్రాంది సీసా చూపిస్తూ.

"ఇంపోర్టెడు స్టఫ్.... కాస్త పుచ్చుకుంటావా" అన్నాడు.

"ఏమిటిది?— అన్నాడు గోపాలం అమాయకంగా.

"ఇంపోర్టెడు బ్రాంది.... కాస్త రుచి చూస్తే నీకే తెలుస్తుంది మజా...."

"నా కొద్దురా బాబూ. ఆ పుచ్చుకునే దేదో నువ్వే పుచ్చుకో...."

"అయితే సరే.... నీకోసం "కోకాకోలా" తెప్పిస్తాను...."

సుందరం హోటలు "బేరర్"ని పిలిచి. ఓ ప్లేటు "చిప్సు". ఓ "కోకాకోలా". ఓ సోడా పట్టుకు రమ్మన్నాడు. గోపాలం పోయి మంచం మీద కూర్చున్నాడు. సుందరం బేరర్ కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు కుర్చీలో. కొద్ది నిముషాల తర్వాత "బేరర్" వచ్చాడు. సుందరం "కోకాకోలా" సోడా "బాటిల్సు" ఓపెన్ చేసి, గ్లాసుల్లో పోశాడు. ఓ గ్లాసులోది




నీళ్ళలా వుంది. రెండో గ్లాసులోది రంగుగా వుంది.

"రారా గోపాలం.... నీ కోసం కోకాకోలా తెప్పించా...." అన్నాడు సుందరం.

గోపాలం వచ్చి. సుందరం ప్రక్కనే వున్న కుర్చీలో కూర్చున్నాడు. రంగులో వున్న గ్లాసు గోపాలానికిస్తూ.

"ఫర్వాలేదు తాగరా.... కోకాకోలా" అన్నాడు సుందరం.

గోపాలం. సుందరం. కబుర్లు చెప్పుకుంటూ గ్లాసులు ఖాళీ చేశారు. ఓ పావు గంట గడిచే సరికి గోపాలానికి వళ్ళు తిమ్మిరెక్కినట్లు అన్పించ సాగింది.

"ఏమిట్రా కోకాకోలా అంత స్ట్రాంగుగా వుంది...." అన్నాడు గోపాలం.

సుందరం నవ్వుతూ. "మై పూర్ బ్రదర్.... మరేం ఫర్వాలేదు.... నువ్వు త్రాగింది వుత్త కోకాకోలా కాదు. కాస్త బ్రాందీ మిక్స్ చేశాను." అన్నాడు.

గోపాలం ముఖం పాలిపోయింది.

"ఎంతపని చేశావురా సుందరం."

"దీన్లో కంగారు పడాల్సింది లేదు. కాస్సేపు కూర్చుంటే నిషా తగ్గిపోతుంది"

సుందరం అన్నట్లు గోపాలానికి నిషా తగ్గలేదు. అంతకంతకూ ఎక్కువైంది. వళ్ళు గాలిలో తేలిపోతున్నట్లు అన్పించ సాగింది. అంతా మసకమసగ్గా కన్పిస్తోంది. 'ఎంత త్వరగా ఇల్లుచేరితే అంత మంచిద'నిపించింది గోపాలానికి. కుర్చీ లోంచి లేచి నిలబడ్డాడు.

"ఇంక వెడతాన్రా సుందరం"

"కాస్సేపు కూర్చుని పోకూడదూ?"

"లేదురా. అప్పుడే తొమ్మిదిన్నరైంది. ఇంట్లో ఆ అమ్మాయి పక్కత్తే వుంటుంది."

"సరే నీ యిష్టం."

సుందరం గోపాలాన్ని అనుసరించాడు. గోపాలానికి మాటలుముద్దగా వస్తున్నాయి. అడుగులు అడ్డదిడంగా పడుతున్నాయి. అతడిని ఆటో రిక్షా ఎక్కించి వెళ్ళిపోయాడు సుందరం.

గోపాలం ఇల్లు చేరేసరికి స్వర్ణలత హాల్లో కూర్చునివుంది. అతడివైపు పరికించి చూసింది. కళ్ళు ఎర్రగా వున్నాయి. తూలిపోతున్నాడు. విసుపోతూ అతడి దగ్గరకు వచ్చి "మీరు త్రాగి వచ్చారా?" అంది.

గోపాలం సమాధానం చెప్పలేదు. తన గదిలోకి పోయి మంచంమీద చతికిలబడ్డాడు. స్వర్ణలత అతడి దగ్గరకు వచ్చి,

"పదండి భోజనం చేద్దురుగాని."

గోపాలం నిలబడి తూలిపోతూంటే, స్వర్ణలత పట్టుకుంది. అతడి చెయ్యిపట్టుకుని లోపలకు నడిపించుకుని వెళ్ళింది. గోపాలానికి అన్నం సయించింది కాదు. నాలుగు మెతుకులు కొరికి భోజనంఅయిందన్పించాడు. స్వర్ణలత అతడిని గదిలోకి తీసుకునిపోయి మంచం మీద కూర్చోబెట్టింది. ఆ తర్వాత స్వర్ణలత భోజనం చేసింది. ఓ మరచెంబుతో నీళ్ళు, గ్లాసూ తీసుకుని గోపాలం గదిలోకి వెళ్ళింది. అవి బల్లమీద పెట్టి, గోపాలంవైపు చూసింది. అతడు ఆమెవైపు కళ్ళింతవి చేసుకుని చూస్తున్నాడు. ఆమె మసకమసగ్గా కన్పిస్తోంది. స్వర్ణలత తెల్లటి చీరా, తెల్లటి జాకెట్టు వేసుకుంది. తలలో మల్లెలు ముడుచుకుంది. స్వర్ణలత అప్సరసలా కన్పిస్తోంది. కోరికల్ని రేకెత్తిస్తోంది. 'స్వర్ణ అందంగా వుంటుంది' అనుకున్నాడు.

"మంచినీళ్లియ్యి స్వర్ణా."

స్వర్ణలత మంచినీళ్ళ గ్లాసు అందిస్తూంటే, ఆమె వేళ్ళు అతడి వేళ్ళకు తగిలాయి. ఆమెవైపు చూశాడు. ఆమె నేల చూపులు చూస్తోంది. అతడు మంచినీళ్ళు త్రాగేసి, గ్లాసు నేలమీద పెట్టేశాడు. ఆ తర్వాత ముందుకు వంగి ఆమె చెయ్యి పట్టుకోబోయాడు....

ఆ మరునాడు గోపాలం నిద్రలేచేసరికి ఎనిమిది గంటలు కావస్తోంది. భోజనాల గదిలో గుమ్మానికానుకుని, నుదుటచెయ్యి పెట్టుకుని కూర్చుని వుంది స్వర్ణలత. ఆమె ముఖం అతిగంభీరంగా వుంది: జుత్తంతా చెదిరివుంది; మాటి మాటికీ చీరకొంగుతో కళ్ళు తుడుచుకుంటోంది. గోపాలానికి ఆమె ప్రవర్తన అర్థంకాలేదు. ఆమెవైపు చూస్తూ నిలబడిపోయాడు. స్వర్ణలత కాఫీ తెచ్చి ఇచ్చింది. ఆమె వెనుదిరిగి వెడుతూంటే

"ఏమిటి స్వర్ణా....అలా వున్నావు?" అన్నాడు గోపాలం.

స్వర్ణలత వెనక్కితిరిగి, అతడివైపు చూస్తూ

"నేనెలా వుంటేనేం? మీరు అర్చేవారా, తీర్చేవారా అంది.

స్వర్ణలత వెక్కి వెక్కి ఏడుస్తూ నిలబడి పోయింది. గోపాలం కాఫీగ్లాసు బల్ల మీద పెట్టి ఆమె దగ్గరకు వెళ్ళి అనునయ స్వరంతో

"చెప్పు స్వర్ణా....ఎందుకేడుస్తున్నావ్?' అన్నాడు.

"ఆ నటన మీ మగవాళ్ళకే చేతనవుతుంది. ఏం తెలీనట్లు ఎలా మాట్లాడుతున్నారో."

"నేనా స్వర్ణా? .... గోపాలం తెల్లబోయాడు.

"అవును మీరే. రాత్రి తప్పత్రాగొచ్చి ఎలా ప్రవర్తించారో మీకు గుర్తుంటేకదా: ఆ క్షణాన నేను పెళ్ళికాని కన్నెపిల్లనని. మానంపోతే నా జీవితం నాశనమవుతుందనీ ఆలోచించారా?"

"చెప్పేది సరిగ్గా చెప్పు. నాకు అర్ణం కావడంలేదు."

"అవును. ఎలా అర్థమవుతుంది? రాత్రిపూట పడుకునేటప్పుడు మీకు మంచినీళ్ళు త్రాగటం అలవాటని, మంచినీళ్ల ఇవ్వడానికివస్తే చెయ్యందుకుని ఇష్టమొచ్చినట్లు మాట్లాడ మీ చేతుల్నుండి బయటపడాలని శతవిధాలా ప్రయత్నించాను. ఓ అబలని....ఓడిపోయాను. పశుబలంతో నా మానాన్ని అపహరించారు. ఇక నాకు మిగిలిన మార్గమల్లా ఏ నుయ్యో గొయ్యో చూసుకోవడమే. అనవసరంగా గొడవల్లో పడతానని భయపడకండి. ఓ ఉత్తరంపెట్టి మరీ చస్తాన్లెండి. మా అమ్మ వచ్చాక మాత్రం చెప్పండి. ఎవరో బలాత్కరిస్తే ఆత్మహత్య చేసుకున్నానని...."

గోపాలం ముఖం పాలిపోయింది. స్వర్ణలత వెక్కి వెక్కి ఏడ్వసాగింది.




అతడు గదిలోకి వెళ్ళి మంచంమీద చతికిలబడ్డాడు. అతడిదృష్టి నేలమీద పడివున్న గాజుముక్కపై పడింది. అది స్వర్ణలత గాజుది! పక్కవైపు చూశాడు. దుప్పటి చిందర వందరగా వుంది. దానిమీద నాలుగైదు పొడవాటి తలవెంట్రుక లున్నాయి. రెండు గాజుముక్క లున్నాయి! అయిదారు నలిగిన మల్లెలున్నాయి! గోపాలం నిర్ఘాంతపోయాడు—ఆ నిషాలో తను స్వర్ణలతను అనుభవించాడా? ఎంత పని జరిగింది? సుందరమ్మ తనేదో మంచివాడని గది అద్దెకిచ్చింది. ఇప్పుడావిడకు ముఖం ఎలా చూ పెట్టగలను? స్వర్ణలత జీవితంతో ఆటలాడ్డానికి ఎవరిచ్చారు తనకు అధికారం? "ఇదంతా ఆ సుందరంగాడి వల్లే జరిగింది" అనుకున్నాడు.

తొమ్మిది కావస్తూంటే స్వర్ణలత అతని దగ్గరకు వచ్చి. "స్నానం చేసి వస్తే భోజనం వడ్డిస్తాను...." అంది పొడిగా.

గోపాలం మారుమాట్లాడక స్నానం ముగించుకుని భోజనానికి వెళ్ళాడు. స్వర్ణలత అతడికి వడ్డించింది.

నువ్వుకూడా కూర్చో స్వర్ణా...."

"నాకు తినాలనిపించడంలేదు...."

"అయితే నేనూ తినను...."

గోపాలం లేవబోయాడు. స్వర్ణలత అతడి ప్రక్కనే విస్తరి వేసుకుంటూ

"బావుంది మీ వరస.... నేను చెయ్యనంటే మీరు మానుకోవడమెందుకు...." అంది కోపంతో. మాటల్లేకుండానే భోజనాలయాయి.

గోపాలం ఆఫీసుకి వెడుతూ, "నువ్వు కంగారుపడి ఏ అఘాయిత్యమూ చెయ్యకు స్వర్ణా...." అన్నాడు.

స్వర్ణలత మాట్లాడలేదు, తలెత్తి అతడి వైపు చూసింది.

గోపాలం ఆ రోజంతా ఆఫీసులో ఆలోచిస్తూనే వున్నాడు. స్వర్ణ నిప్పులాంటి మనిషి. తను తాగిన నిషాలో ఆమెను అనుభవించాడు.ఆఅనుభవం ఆమె పాలిట.. స్వర్ణ ఆత్మాభిమానం ఎటువంటిదో తెలుసు. అన్న మాటప్రకారం ఏ నుయ్యో గొయ్యో చూసుకుంటుంది. పోనీ ఆమెను పెళ్ళిచేసుకుందామా? అంటే తల్లి ఏడుస్తుంది. మామయ్య తనపై చాలా కాలంగా ఆశలు పెంచుకున్నాడు. ఏం చెయ్యాలి?

ఆ సాయంత్రం గోపాలం ఇల్లు చేరేసరికి, స్వరలత వరండాలో శోకదేవతలా కూర్చుని వుంది. అతడిని చూసి కాఫీ తెచ్చి ఇచ్చింది.

ఆ రాత్రి భోజనాలయ్యాక, హాల్లో ఆలోచిస్తూ కూర్చుంది స్వర్ణలత.

"ఏమిటంత దీర్ఘంగా ఆలోచస్తున్నావు స్వర్ణా...."అన్నాడు గోపాలం.

స్వర్ణలత నవ్వు తెచ్చి పెట్టుకుని. "రేపట్నుంచి మీ భోజనం ఎలాగా? అని ఆలోచిస్తున్నాను...." అంది.

"అంటే...."

"ఏమీ లేదు...."

ఆ రాత్రి నిద్ర పట్టక ఏదో పుస్తకం చదువుతూ కూర్చున్నాడు గోపాలం. ఓ రాత్రివేళ బల్ల జరిపిన చప్పుడైతే స్వర్ణలత పడగ్గదిలోకి వెళ్ళిచూశాడు. స్వర్ణలత బల్లమీద నిలబడి, పై దూలానికి తాడు బిగిస్తోంది కొద్దిసేపు గుడ్లప్పగించి ఆమె వైపు చూస్తూ నిలబడిపోయాడు. తాడు రెండో కొస వురేసుకోడానికి ముడివేసి, ఆ ముడి మెడలో వేసుకోబోతుంటే, గోపాలం ఆమె దగ్గరకు కంగారుగా వెళ్ళి,

"ఏంచేస్తున్నావు స్వర్ణా?" అన్నాడు.

స్వర్ణలత అతనివైపు చూసి,

"మీరా." అంది.

"అవును, నేనే స్వర్ణా."

"మీకిక్కడేం పని. వెళ్ళండి, నా దారికి అడ్డంరాకండి. మానంపోయిన ఆడది బ్రతికేకంటే చస్తేనే మంచిది."

గోపాలం చటుక్కున ఆమెను రెండు చేతుల్తోటీ పట్టుకుని క్రిందికి దింపి. "నిన్ను చావనివ్వను స్వర్ణా. నావల్ల నీ జీవితం నాశనం కాకూడదు" అన్నాడు.

"నన్ను వదలండి. నా కోసం మీరేం చెయ్యగలరు." స్వర్ణలత వెక్కివెక్కి ఏడ్వసాగింది.

గోపాలం ఆమెను మరింత దగ్గరకు తీసుకుని, కన్నీటిని తుడుస్తూ "ఏంచేస్తానో చెప్పనా స్వర్ణా. జీవితాంతమూ నీకు బందీనై పోతాను. నిన్ను పెళ్ళిచేసుకుంటాను." అన్నాడు.

"మీకు మేనరికం వుంది."

"ఉండడంమాట నిజమే. చిన్నప్పటి నుంచి మామయ్య కూతుర్ని నా పెళ్ళామనే వారు. నిజానికి దానిని నేను ప్రేమించలేదు. అమ్మమనస్సు కష్టపెట్టుకుంటుందని దాన్ని పెళ్ళిచేసుకుందామనుకున్నాను. నువ్వంటే నాకు చాలా ఇష్టం స్వర్ణా. నిజానికి నిన్ను ప్రేమించాను. అమ్మ ఎదురు చెప్పినాసరే నిన్నే పెళ్ళిచేసుకుంటాను."

స్వర్ణలత కన్నీటికళ్ళతో గోపాలంవైపు చూసింది. గోపాలం ఆమె చెయ్యిపట్టుకుని "ప్రామిస్ స్వర్ణా" అన్నాడు. ఆ తర్వాత.

"నిన్నరాత్రి విషయం ఎవరితోనూ చెప్పనని మాటియ్యి స్వర్ణా." అన్నాడు.

స్వర్ణలత తన చెయ్యిని అతడి చేతిలో వేస్తూ "ప్రామిస్" చేస్తున్నాను. ఆవిషయం మనిద్దరిమధ్యే వుంటుంది. మీరూ నాకొక 'ప్రామిస్' చెయ్యాలి"

"ఏమిటది స్వర్ణా?"

"మరెప్పుడూ తాగనని మాటివ్వండి."

"మరెప్పుడూ తాగనని 'ప్రామిస్' చేస్తున్నాను స్వర్ణా." అంటూ తన చెయ్యి ఆమెచేతిలో వేశాడు.

స్వర్ణలత గోపాలం వక్షంపై తల వాల్చింది.

మరో వారంరోజులు గడిచాక సుందరమ్మ వచ్చింది. స్వర్ణలతని పెళ్ళిచేసుకుంటానని చెప్పాడు గోపాలం. సుందరమ్మ ఆశ్చర్యపోయి. ఆ తర్వాత సంతోషంతో ఒప్పుకుంది.

ఆ తర్వాత సుందరమ్మ స్వర్ణలత బుగ్గగిల్లి, 'నువ్వు కోరుకున్న వరుడే వస్తున్నాడే తల్లీ' అంది. స్వర్ణలత సిగ్గుతో తల్లి వక్షంలో ముఖం దాచుకుంది.

గోపాలం తల్లినీ. అన్నగారినీ వెంటనే బయలుదేరి రమ్మని ఉత్తరం వ్రాశాడు. ఉత్తరం అందడమే తరువాయి కంగారు పడుతూ వాళ్ళిద్దరూ హైదరాబాదుకి ప్రయాణమయ్యారు.

గోపాలం టూకీగా రెండు ముక్కల్లో తాను స్వర్ణలతను పెళ్ళి చేసుకుందామని నిర్ణయించుకున్నట్లు తల్లికీ, అన్నగారికీ చెప్పాడు. 'వాడికి ఆ పిల్ల నచ్చింది. వాడిష్ట ప్రకారమే జరగనిస్తే మంచిది' అనుకున్నాడు అతడి అన్నగారు. తల్లిమాత్రం వెంటనే ఒప్పుకుంది కాదు. తమ్ముడి కూతురు కోడలు కాకుండా పోతోందని బెంగపడింది. అయితే వెంటనే కొడుక్కి ఎదురు చెప్పనూలేకపోయింది. సుందరమ్మ ఘనంగా మర్యాదలు చేసింది. ఆవిడచేసే మర్యాదా; స్వర్ణలత అందచందాలు;వినయ విధేయతలూ; తెలివితేటలూ గోపాలం తల్లిని రెండు రోజుల్లో ఆకర్షించాయి. అంతేకాక సుందరమ్మ అంది:

"మాకు రాజమండ్రిలో ఓ ఇల్లువుంది వదినగారూ.... అది పెద్దమ్మాయికి ఇచ్చేశాను.... ఈ ఇల్లు చిన్నదానికే ఇచ్చేస్తాను.... అంతేగాక పల్లెటూళ్ళలో పదిహేనెకరాల మాగాణివుంది.... చిన్నదానికి కట్నం ఇవ్వటంలేదు కాబట్టి పదెకరాలు రాసిస్తాను...." గోపాలం తల్లి సంతోషంతో ఒప్పుకుంది. నెలరోజులు తిరక్కుండానే స్వర్ణలతా, గోపాలంల వివాహం జరిగిపోయింది. సుందరమ్మ డబ్బుని చూసుకోక పెళ్ళి ఘనంగా చేసింది.

గోపాలాన్ని అన్ని విధాలా సుఖ పెడుతోంది స్వర్ణలత.

ఓ నెలరోజుల క్రితం పెద్దకూతురికి పురిటి రోజులని రాజమండ్రి వెళ్ళింది సుందరమ్మ.

*　　*

వాలుకుర్చీలో కూర్చుని ఆలోచనల్లో పడ్డ గోపాలం, లోపల గిన్నెల చప్పుడవుతూంటే 'ఉలిక్కి' పడ్డాడు. 'పిల్లికాబోలు' అనుకుంటూ లోపలికి వెళ్ళాడు. వంటగదిలో స్వర్ణలత కాఫీ కలుపుతోంది. భార్యను చూసి ఆశ్చర్యపోతూ,

"నువ్వెప్పుడొచ్చావు స్వర్ణా...."అన్నాడు.

"అయ్యోరామా....అంత పరధ్యాన్నమైతే ఎలా చెప్పండి .... నేను వచ్చినట్లైనా తెలీదూ? దొంగాడొచ్చినా అంతే కదా...."

గోపాలం మరి మాట్లాడలేక, హాల్లోకి వచ్చి కూర్చున్నాడు. స్వర్ణలత రెండు గ్లాసుల్తో కాఫీ పట్టుకుని వచ్చింది. ఓ గ్లాసు అతడికిచ్చి తనోగ్లాసు తీసుకుని పక్కనే వున్నకుర్చీలో కూర్చుంటూ,

"వంట ఆలస్యమౌతుందని కాస్త కాఫీ కలిపాను" అంది.

కాఫీలు త్రాగడమయ్యాక, స్వర్ణలత బల్లమీదున్న మల్లెచెండు పొట్లాం అతడి చేతికిచ్చి, వెనక్కి తిరిగి గారంగా అంది,

"దండ జడలో పెడుదురూ."

గోపాలం పొట్లాం విప్పి దండ చేత్తో పట్టుకుని,

"స్వర్ణా ఓ చిన్న అనుమానం".

"ఏమిటది?"

"మన పెళ్ళికిముందు నేను త్రాగివచ్చిన రోజు రాత్రి నువ్వన్నట్లు నేనలా ప్రవర్తించానా'"

స్వర్ణలత చటుక్కున అతడి వైపుతిరిగి కళ్ళింతవి చేసుకుని చూస్తూ,

"మగ బుద్ధి పోనిచ్చుకున్నారు కారు మరో మూడ్నెలల్లో తండ్రి కాబోతూ కూడా." అంటూ బుంగమూతి పెట్టింది.

"అప్పే వృత్తినే అడిగాను స్వర్ణా" అంటూ గోపాలం ఆమెను వెనక్కి తిప్పుకుని. ఆమె జడలో దండ తురిమాడు.

"స్వర్ణా."

స్వర్ణలత అతడి వైపు తిరిగింది. గోపాలం ఆమెను దగ్గరగా లాక్కుని, ఆమె చెవిలో మెల్లగా అన్నాడు,

"మరి నా లంచం?"

స్వర్ణలత మూతి సున్నాలా పెట్టి, ఆ తర్వాత తన ముఖాన్ని అతడి ముఖానికి దగ్గరగావుంచి అతడు కోరింది ఇచ్చింది.

★

